ముందస్తు పరీక్ష.. క్యాన్సర్ నుంచి రక్ష

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు
- ఇంటింటి సర్వేలో ఆరోగ్యశాఖ సిబ్బంది
- ముఖ్యంగా మహిళల్లో వచ్చే క్యాన్సర్ గుర్తింపు



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అవుకు: ప్రస్తుతం సమాజంలో చాపకింద నీరులా క్యాన్సర్ వ్యాధి వ్యాపిస్తోంది. అరికట్టేందుకు ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. క్యాన్సర్‌పై విజయం.. స్క్రీనింగ్‌తో సాధ్యం కార్యక్రమంతో ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఈ సమాచారాన్ని నిక్షిప్తం చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఇందు కోసం ఆరోగ్యశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇంటింటికి వెళ్లి నిర్వహిస్తున్న సర్వేను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికి పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్యశాఖ సర్వే ప్రకారం క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల అధిక మరణాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మహమ్మారిని ఎదుర్కోవాలంటే ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ లక్షణాలు గుర్తించడం ద్వారా క్యాన్సర్ బాధితుల మరణాల సంఖ్యను తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళల్లో పలు రకాల క్యాన్సర్‌లు వచ్చే అవకాశాలు ఉన్నాయని వారికి అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించాలని వైద్యులు చెబుతున్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రధానం

ఒక వ్యక్తిలో క్యాన్సర్ కణాల కోసం వెతకడాన్నే క్యాన్సర్ స్క్రీనింగ్ అని పిలుస్తారు. ఆ వ్యక్తిలో క్యాన్సర్ ప్రభావిత లక్షణాలు ఉన్నాయో లేదో ఆరోగ్య సిబ్బంది పరిశీలించి క్యాన్సర్ పరీక్షలు చేస్తారు. క్యాన్సర్ నివారణ, ముందస్తు రోగ నిర్ధారణకు మెరుగైన ఫలితాల కోసం ఈ పరీక్షలు ఉపయోగపడతాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఆయుస్మాన్ భారత్ సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఇంటి వద్దకు వెళ్లి వ్యక్తిని అడిగే ప్రశ్నలు

- **వ్యక్తిగత వివరాలు:** ఏదైనా గుర్తింపు నంబరు, ఆరోగ్య బీమా, వయస్సు, లింగం, తాగునీటి వివరాలు.
- సాధారణ సమాచారం: పొగ తాగుతున్నారా, ఖైనీ, గుట్కా వంటివి తింటున్నారా, మద్యం సేవిస్తున్నారా, కుటుంబంలో ఎవరికైనా అధిక రక్తపోటు, మధుమేహం, గుండెజబ్బులు వంటి వ్యాధులున్నాయా.
- ముందస్తుగా రోగిని గుర్తించడం: గతంలో ఏవైనా వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నాయా
- **నోటి క్యాన్సర్:** నోటిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, తెల్లటి మచ్చలు, ఎర్రటి మచ్చలు, ఎప్పటికీ మానని పుండ్లు, నోటిలో కణితలు పెరగడం, నోరు తెరవడంలో ఇబ్బంది ఉండడం.
- **రొమ్ము క్యాన్సర్:** ఈ క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలు, చనుమొన ఆకారంలో మార్పు, లోపలికి లాగినట్టు ఉండడం, పగుళ్లు, చర్మం ఎరుపు రంగుగా మారడం, స్రావం అవ్వడం, చంకల్లో వాపు, గడ్డలు, స్థిరంగా నొప్పి ఉండడం.

ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై ఎలాంటి అపోహలు వద్దు. క్యాన్సర్ స్క్రీనింగ్‌తో ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. ఎక్కువగా మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లతో బాధపడుతున్నారు. వారు ఈ పరీక్షలతో సత్ఫలితాలు పొందవచ్చు. ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించి పరీక్షలు చేయించుకోవాలి.

–డాక్టర్ వినోద్ కుమార్,
ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- **గర్భాశయ క్యాన్సర్:** బహిస్టు సమయంలో అధిక రక్త స్రావం, ఋతుక్రమం నిలిచిపోయిన తరువాత రక్తస్రావం, లైంగిక సంపర్కం తరువాత రక్తస్రావం, దుర్వాసన గల స్రావాలు.
- రోగి మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ప్రశ్నలు.

సర్వే ఇలా..

ప్రతి ఇంటి వద్దకు ఆరోగ్య శాఖ సిబ్బంది వెళ్లి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని యాప్ ద్వారా వివరాలు అప్‌లోడ్ చేస్తారు. వీటితో దంత పరీక్ష సమస్యలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. వ్యక్తికి క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముందుగా అవగాహన కల్పిస్తారు. అదే విధంగా రోజులో ఐదు ఇళ్లు, వారంలో ఐదు రోజులు పరీక్షలు నిర్వహిస్తున్నారు. వంద శాతం ప్రజలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు.

రేపు చౌడేశ్వరీదేవి ఆలయంలో కార్తీక దీపోత్సవం

బేతంచెర్ల: కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో కార్తీక మాసం కడ మంగళవారం సందర్భంగా ఈ నెల 26న కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం కార్తీక దీపోత్సవం, అనంతరం భవానీ, అయ్యప్ప స్వామి మాలధారులకు భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన



ఆర్అండ్‌బీ సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి బీసీ

బనగానపల్లె రూరల్: మండలంలోని గులాంనబీపేట గ్రామ సమీపంలో జరుగుతున్న ఆర్ అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూలిన మట్టిమిద్దె



కూలిపోయిన మట్టిమిద్దె

కోవెలకుంట్ల: పట్టణంలోని సప్తగిరి పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న అంగన్‌వాడీ ఆయా వెంకటసుబ్బమ్మకు చెందిన మట్టిమిద్దె శనివారం అర్ధరాత్రి కూలిపోయింది. ఆమె కోవెలకుంట్ల 1వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. రాత్రి ఆలస్యం కావడంతో అక్కడే ఉండిపోయింది. పాతకాలం నాటి మిద్దె కావడంతో అర్ధరాత్రి దంతెలు విరిగిపోయి కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. రెవెన్యూ అధికారులు ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటోంది.

నయనాలప్ప క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామివారు

సంజామల: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని నయనాలప్ప ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్యం, హారతి సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముచ్చట్ల మల్లికార్జున స్వామికి విశేష పూజలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. ఆలయ ఆవరణలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

భక్తిశ్రద్ధలతో కిస్తీ బండి ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

డోన్ టౌన్: స్థానిక కొండపేటలో వెలసిన హజరత్ హసన్‌వలి, మౌలాలి స్వాముల కిస్తీ బండిని ఆదివారం భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. దర్గా కమిటీ ప్రధాన కార్యదర్శి అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో కిస్తీ ప్రసాదాలను తీసుకువచ్చారు. అనంతరం దర్గా ఆవరణలో స్వామివారికి గంధం సమర్పించి ఫాతెహాలను చదివించారు. కార్యక్రమంలో దర్గా అధ్యక్షుడు చిన్నరహిమాన్, తులసీ నాయక్, పద్మా నాయక్, ముంతాజ్ నాయక్, అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్లకు చెందిన వ్యక్తి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 108 అంబులెన్స్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుటుంబ సమస్యల కారణంగా క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించగా సిబ్బంది కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

- నాలుగు కుటుంబాలకు రూ.53 వేల చొప్పున సాయం



మిత్రుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసిన పూర్వ విద్యార్థులు

ప్యాపిలి: వివిధ కారణాలతో మృతి చెందిన మిత్రుల కుటుంబాలపై పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. మృతి చెందిన నలుగురు మిత్రుల కుటుంబ సభ్యులకు ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో చెరో రూ. 53 వేలు చొప్పున రూ. 2,12,000 అందజేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల్లో మాధవయ్య, నరసింహులు, మురళి, రామాంజనేయులు వివిధ కారణాలతో మృత్యువాత పడ్డారు. తమతో పాటు చదువుకున్న నలుగురు మిత్రులు రెండు నెలల వ్యవధిలో మృతి చెందడంతో పూర్వ విద్యార్థులు తల్లడిల్లారు. మృతుల కుటుంబాలకు తమ వంతు ఆర్థికసాయం అందించాలని భావించి చేయిచేయి కలిపారు. రూ. 2,12,000 సేకరించి నాలుగు కుటుంబాలకు సమానంగా అందజేశారు. పూర్వ విద్యార్థులను పట్టణ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో శివ, రామచంద్ర, కిరణ్‌కుమార్, బాలకృష్ణ, సురేశ్, సురేశ్ బాబు, రాము, రమేశ్, రామచంద్రగౌడ్, నాగప్ప, రాజు, రామకృష్ణ, చాంద్‌బాష, అంజనేయులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

డోన్ టౌన్: మాట తప్పిన మోదీ ప్రభుత్వంపై మరో పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని, ఈ నెల 26న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరాం, రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగమద్దయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మోటర్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సీఐటీయూ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. రైతు వ్యతిరేక నల్లచట్టాలను తెచ్చిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఢిల్లీలో దాదాపు ఏడాది కాలంగా రైతులు పోరాటం చేసినప్పుడు ప్రభుత్వం ఇచ్చిన మాటను ఇప్పటికీ నిలబెట్టుకోలేదన్నారు. ఢిల్లీలో రైతులు చేసిన ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 26న కలెక్టర్ కార్యాలయాల వద్ద రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఐటీయూ నాయకులు కొండయ్య, రామాంజనేయులు, నక్కి శ్రీకాంత్, శ్రీనివాసులు, తిమ్మయ్య, మురళి, ప్రసాద్, రంగడు, వలి, సుబ్బయ్య, రామాంజనేయులు, రామకృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా క్యాండిల్ సర్వీస్



క్యాండిల్ ఆరాధనలో క్రైస్తవులు

బనగానపల్లె రూరల్: స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చిలో ఆదివారం సాయంత్రం క్యాండిల్ సర్వీస్ ఆరాధన భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చి ఫాదర్ రెవరెండ్ దైవదీనం, రిటైర్డ్ ఫాదర్ రెవరెండ్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ.. ఏటా క్రిస్మస్ పండుగ ముందుగా నవంబర్ నెలలో క్రైస్తవులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రత్యేక ఆరాధనలు చేస్తారని తెలిపారు. చివరి రోజు సీఎస్ఐ చర్చిలో క్యాండిల్ లైట్ సర్వీస్ ఆరాధన చేస్తారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంఘ పెద్దలు పి. ప్రసాద్, కరుణాకర్, మంజులామణి, సరోజమ్మ సుందరం, భాగ్యరాజ్, ప్రమీలారాణి, శాంతమ్మ, రేవతి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కార్తీక వన భోజనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గౌడ సంఘీయులు

డోన్ టౌన్: పట్టణంలో ఆదివారం ఈడిగ(గౌడ్), బలిజ కుల సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వన భోజన మహోత్సవాలు నిర్వహించారు. పట్టణ సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ వద్ద బలిజ సంఘీయులు, ఉడుములపాడు దత్తాత్రేయస్వామి దేవాలయంలో ఈడిగ (గౌడ) సంఘీయులు కార్తీక మాస వన భోజన మహోత్సవాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



వనభోజన కార్యక్రమానికి హాజరైన బలిజ కులస్తులు



పుష్కరిణిలో కార్తీక స్నానాలు చేస్తున్న భక్తులు



యాగంటి ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

యాగంటిలో కార్తీక సందడి

బనగానపల్లె రూరల్: కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో యాగంటి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తుల తరలి రావడంతో సందడి నెలకొంది. భక్తులు ముందుగా ఆలయ ఆవరణలోని పుష్కరిణిలో కార్తీక స్నానాలు చేశారు. ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన ఉమామహేశ్వరస్వామి, నందీశ్వరుడిని దర్శించుకున్నారు.

నేడు ప్రత్యేక బస్సు సర్వీస్‌లు

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా నేడు యాగంటి క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీస్‌లు ఏర్పాటు చేసినట్లు బనగానపల్లె డిపో మేనేజర్ రవి కిశోర్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి బస్సు సర్వీస్‌లు అందుబాటులో ఉంటాయని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాయిబాబా ఆలయానికి రూ.లక్ష విరాళం



చెక్కును సుబ్బారెడ్డికి అందజేస్తున్న దాత

డోన్ టౌన్: పట్టణ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి బేతంచెర్ల పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త అంబటి వెంకటసుబ్బారెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డిని కలిసి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా దాతను సభ్యులు కందుకూరు పార్థ, శ్రీను, సురేష్, ఆలా మల్లికార్జునరెడ్డి సత్కరించారు.

చౌడేశ్వరిదేవి ఆలయ నిర్మాణానికి విరాళం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చౌడేశ్వరిదేవి ఆలయ నిర్మాణానికి పారిశ్రామికవేత్త అంబటి వెంకటసుబ్బారెడ్డి రూ.3.16 లక్షల విరాళాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా గ్రామస్తులకు అందజేశారు. ఆదివారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాత వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తాను గతంలో యాగంటిపల్లె గ్రామంలో నివసించానని.. అమ్మవారిపై భక్తితో ఆలయ నిర్మాణానికి తన వంత విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌలీశ్వరరెడ్డి, బండి వెంకట్రామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కొలిమిగుండ్ల రామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదుకు స్పందన కరువు



ఎవరూ రాకపోవడంతో ఒంటరిగా ఉన్న బీఎల్ఓ

బనగానపల్లె రూరల్: మండలంలో ఓటు హక్కు లేని 18 ఏళ్ల నిండి యువతి యువకుల నమోదు కోసం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో నిర్వహించిన ఓటు హక్కు నమోదు ప్రత్యేక కార్యక్రమానికి ఓటర్ల నుంచి స్పందన కరువైంది. ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు ఉండాల్సి ఉన్నా కొందరు మధ్యాహ్నం వరకే ఉన్నారు. ఎవరూ పెద్దగా రాకపోవడంతో వెళ్లిపోయారు. బనగానపల్లె నియోజకవర్గంలో మొత్తం 336 దరఖాస్తులు వచ్చినట్లు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మంజులారెడ్డి తెలిపారు. ఇందులో ఫారం 6కు 219 మంది, ఫారం 7కు 18 మంది, ఫారం-8కు 99 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

జొన్న పంటకు సుడి తెగులు



పంటలో ఆశించిన సుడి తెగులు

బనగానపల్లె: నియోజకవర్గంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన మహేంద్ర జొన్న పంటకు సుడి(కత్తెర) తెగులు ఆశించడంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 3 వేల హెక్టార్లలో ఈ పంటను సాగు చేశారు. ఒక్క బనగానపల్లె మండలంలోనే సుమారు వెయ్యి హెక్టార్లలో సాగు చేశారు. ఎకరాకు రూ.10వేల వరకు పెట్టుబడి పెట్టారు. సుడి తెగులు వల్ల పంట దెబ్బతిని దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నివారణకు క్రిమిసంహార మందులు వాడినా అదుపులోకి రావడం లేదని వాపోతున్నారు. వ్యవసాయాధికారులు జొన్న పంటను పరిశీలించి తెగులు నివారణకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు.

హడలెత్తిస్తున్న పందులు

ప్యాపిలి: పట్టణంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పవిత్ర కార్తీక మాసంలో స్థానిక నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఇదే సమయంలో ఆలయం వద్ద పందుల సంచారం ఎక్కువగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి వస్తున్న తమను పందులు వెంబడించి పూజా సామగ్రిని అపవిత్రం చేస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందు ముగ్గులపై ఉంచిన కార్తీక దీపాలను చెల్లాచెదురు చేస్తున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి పందులను పట్టణానికి దూరంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడి ఎన్నికపై హర్షం

డోన్ టౌన్: కోవెలకుంట్లలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ కౌన్సిల్‌లో జిల్లా గౌరవాధ్యక్షుడిగా బీవై సుబ్బరాయుడు, సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా సంజీవ రాయుడు ఎన్నిక డోన్ శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ డోన్ మండల అధ్యక్షుడు లక్ష్మీనాయక్, ప్రధాన కార్యదర్శి గోపాల్, పూర్వ జిల్లా గౌరవాధ్యక్షుడు బాబు, జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తున్న ఏకైక సంఘం యూటీఎఫ్ అని తెలిపారు. ప్రభుత్వం ఓపీఎస్ ఇచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

సంజామల: పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగపల్లెలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరయ్యారు. ప్రజలకు గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, కంటి, చర్మ, కిడ్నీ తదితర సమస్యలకు పరీక్షలు చేసి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్, నంద్యాల గురురాజ పాఠశాల డైరెక్టర్స్ పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి, పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 40 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

డోన్ టౌన్: పట్టణంలోని మదీనా క్లీనిక్‌లో స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. శిబిరాన్ని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శశికుమార్ ప్రారంభించగా కర్నూలుకు చెందిన శాంతిరామ్ ఐ హాస్పిటల్ వైద్యుడు దినేష్‌రెడ్డి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 40 మందికి శస్త్ర చికిత్సలు అవసరం అని గుర్తించారు. సోమవారం వారిని కర్నూలుకు తరలించి చికిత్స చేయిస్తామని స్ఫూర్తి సంస్థ వ్యవస్థాపకుడు ఆలా మధు తెలిపారు.